క్లుప్తంగా

ఉత్సాహంగా వినాయక ఊరేగింపు



వినాయకుడి ఊరేగింపును ప్రారంభించిన రాజేశ్వరి

సామర్లకోట: స్థానిక సీతాఫలదొడ్డిలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఊరేగింపు బుధవారం ఉత్సాహంగా సాగింది. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి దీనిని ప్రారంభించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు మ్యూజికల్ బ్యాండ్, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపు సాగింది. స్థానిక పంచారామ క్షేత్ర ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, నిర్వాహకులు భక్తులకు సేవలందించారు.

డ్వామా అధికారులకు కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో డ్వామా ఏపీఓలకు మంగళవారం ప్లానింగ్ ప్రాసెస్, క్వాలిటీ కంట్రోల్‌పై సీనియర్ ఫ్యాకల్టీ గౌరీశంకర్ శిక్షణ ఇచ్చారు. రైతులకు పంట తోటల పెంపకం నిమిత్తం మొక్కలు ఇచ్చే సమయంలో ఆరోగ్యవంతమైన మొక్కలను పంపిణీ చేయడంతో పాటు వాటి పెరుగుదలకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, నిహారిక, ప్రసాద్ రెండవ రోజు శిక్షణ నిర్వహించారు. గురువారంతో వీరికి శిక్షణ ముగియనుంది.

రేపు, ఎల్లుండి ఉపవాస ప్రార్థనలు

పెద్దాపురం: ప్రపంచ శాంతికై ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనలు గురు, శుక్రవారాల్లో మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో నిర్వహించనున్నట్టు మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం తెలిపారు. బుధవారం ఆయన క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్‌తో కలిసి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఐదు నెలల పాటు ఈ ప్రార్థనలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఏఎస్సై సింహాద్రికి ఎస్పీ పరామర్శ



ఏఎస్సై ఆరోగ్య పరిస్థితిని ఎస్పీ సతీష్‌కుమార్‌కు వివరిస్తున్న వైద్యాధికారి

సామర్లకోట: ఏఎస్సై సింహాద్రిని ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. గణేష్ నిమజ్జనోత్సవ విధుల్లో భాగంగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఏఎస్సైని స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మరో వాహన చోదకుడు ఈ నెల ఒకటిన ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయన కాలు విరగడంతో ఏడీబీ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆయన చికిత్స పొందుతున్నారు. ఎస్పీ ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

రైతులూ.. ఈ-కేవైసీ చేయించుకోండి



అచ్చంపేటలో ఈ-కేవైసీని పరిశీలిస్తున్న ఏఓ సత్య

సామర్లకోట: మండల పరిధిలోని రైతులు ఈ-కేవైసీని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ.సత్య అన్నారు. బుధవారం అచ్చంపేట, పీబీ దేవం గ్రామాల్లో జరుగుతున్న ఈకెవైసీని ఆమె పరిశీలించారు. ఈ నెల 8వ తేదీతో ఈకేవైసీ గడువు ముగుస్తుందని, ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ఆర్బీకేల ద్వారా ధాన్యం విక్రయాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మండల పరిధిలో 11,641 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 6,480 మంది ఈకెవైసీ చేయించుకున్నారన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

ఏలేశ్వరం: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యానికి వివేకానంద సేవా సమితి సభ్యులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. జగ్గంపేట మండలం బూరుగుపూడికి చెందిన పమ్మిరెడ్డి త్రిమూర్తులు, దేవి దంపతుల రెండు నెలల కుమారుడు కార్తిక్ బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. బాలుడి వైద్యానికి రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో స్పందించిన వివేకానంద సేవా సమితి సభ్యులు దాతల ద్వారా రూ.1.27 లక్షలు వసూలు చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్తిక్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మైరాల నాగేశ్వరరావు, మెలిపాక నాగేంద్ర, కె.గోవింద్, ఎస్.వెంకన్న, సూరిబాబు, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణపై సమీక్ష



గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్యామల



వృద్ధునికి పరీక్షల రిపోర్టు, మందులు అందజేసిన ఎంపీపీ, తహసీల్దార్, వైద్యులు

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణపై బుధవారం ఆయన వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలను ప్రజల ముంగిటకు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను అమలు చేస్తోందన్నారు. గ్రామాల్లో 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఎవరికి ఏ ఆరోగ్య సమస్య ఉన్నా తగిన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. స్పెషలిస్టు డాక్టర్లు వైద్య సేవలందించే విషయాన్ని ప్రజలకు తెలియజేసి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలపై ఆరా తీశారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన వస్తోంది. ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వైద్యులే తమ ప్రాంతాలకు వచ్చి సేవలందించడంపై గ్రామాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ ఆరోగ్య భరోసా 'సురక్ష'

ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు

సామర్లకోట: ప్రజల ప్రాణం విలువ తెలిసి, అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. వేట్లపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారితో కలసి ప్రారంభించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి నిపుణులైన వైద్యులు పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారని అన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. శిబిరంలో 432 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తహసీల్దార్ తెలిపారు. డాక్టర్లు ప్రశాంత్, శ్రీహిమతి వైద్య సేవలు అందించారు. ఎంఈఓ-2 పి-పుల్లయ్య, హెల్త్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొని సేవలందించారు.

ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఓ వరమని కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు అన్నారు. మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయం వద్ద బుధ వారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 285 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఈఆర్ అమలుపై శ్రద్ధ వహించాలి

- డీవైఈఓ సుభద్ర
- ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ సుభద్ర

పిఠాపురం: ఉపాధ్యాయులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) అమలుపై శ్రద్ధ వహించాలని డీవైఈఓ సుభద్ర సూచించారు. స్థానిక బాదం మాధవరావు బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పిఠాపురం డివిజన్ స్థాయి పాఠశాలల హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖాధికారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో అమలులో భాగంగా పదో తరగతి ఫెయిలైన విద్యార్థులతో వచ్చే ఏడాది నిర్వహించే పదో తరగతి పరీక్షలకు ఫీజులు కట్టించాలన్నారు. ఓపెన్ స్కూల్‌లో అయినా సరే ఆయా విద్యార్థులతో ఫీజులు కట్టించాలని సూచించారు. వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఎంత మంది ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారు, ఇంకా ఎంత మంది జాయిన్ అవ్వాలి అనే వివరాలు అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని ప్రతి రోజూ హెచ్‌ఎంలు పరిశీలించాలన్నారు. బడిలో చదువుకునే ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఏ-2 పరీక్షలు మూల్యాంకనం పూర్తి చేసి ఈ నెల 9వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. నవంబర్ 3న జరిగే ఎన్ఏఎస్ పరీక్ష వివరాలను డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు వివరించారు. సీబీఎస్ఈ స్కూళ్లలో 5, 6, 7 తేదీల్లో ఎఫ్ఏ 2 పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఏసీ రాజశేఖర్, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సాయి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం జగనన్న గోరుముద్ద



ప్రభుత్వ పాఠశాలలకు చేరిన వంట సామాగ్రితో ఎంఈఓ

సామర్లకోట: ప్రభుత్వం విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న జగనన్న గోరు ముద్ద ప్రత్యేక పోషకాలతో కూడి ఉంటుందని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. బుధవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి, రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకంలో లోపాలుంటే తమ అభిప్రాయాన్ని పాఠశాలలో ఉన్న బాక్స్‌లో వేయాలని విద్యార్థులకు ఆయన సూచించారు. హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, మధ్యాహ్న భోజన పథకం ఇన్‌చార్జిలు ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు, శ్రీవల్లి, కె.శేషారత్నం పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు మంజూరు

మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి వంట పాత్రలు మంజూరైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. 30 లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలను కేటగిరి-ఎ, 31-50 మధ్య విద్యార్థులు ఉంటే బి, 51-150 మధ్య ఉంటే సి, 151-250 మధ్య ఉంటే డి, 251-400 మధ్య ఉంటే ఇ, అంతకు మించి ఉంటే ఎఫ్ కేటగిరీలుగా పాఠశాలలను విభజించినట్టు తెలిపారు. ఏ, బీ కేటగిరిలకు ఐదు, సీ, డీ కేటగిరిలకు 6, ఇ, ఎఫ్ కేటగిరిలకు 11 చొప్పున సామగ్రిని విభజించి అందజేసినట్టు ఎంఈఓ తెలిపారు.

ఇద్దరు వీఆర్ఏల సస్పెన్షన్

గోకవరం: అవకతవకలకు పాల్పడిన ఇద్దరు వీఆర్ఏలను సస్పెండ్ చేసినట్టు స్థానిక తహసీల్దార్ డి.సుగుణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి వీఆర్ఏ కొల్లాటి సుబ్రహ్మణ్యప్రసాద్, మల్లవరం వీఆర్ఏ కుండెల్లి చిన్న తహసీల్దార్ కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ ఆపరేటర్లుగా పని చేసేవారన్నారు. వెబ్‌ల్యాండ్‌లో రైతుల భూములకు డిజిటల్ సైన్ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడంతో పాటు మ్యూటేషన్ చేసిన సర్వే నంబర్లు గల భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు జనరేట్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. డిజిటల్ సైన్ దుర్వినియోగం చేసి వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు చేశారన్నారు. దీనిపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రాథమిక విచారణ నిర్వహించి వారిపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. విచారణ పెండింగ్‌లో ఉందని అప్పటి వరకు వీరిని సస్పెండ్ చేశామని వివరించారు.

అర్హులందరికీ 'ఆసరా'



పిఠాపురంలో మహిళలకు ఆసరా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- మహిళా సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ

పిఠాపురం: అర్హత ఉన్న ప్రతి మహిళా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకం అందేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురంలో మహిళా సంఘాల సభ్యులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలో పలు మహిళా సంఘాలకు ఆసరా పథకం అందించామన్నారు. కాగా కొన్ని సాంకేతిక కారణాల వల్ల నియోజకవర్గంలోని 15 సంఘాలకు ఆసరా పథకం వర్తించలేదన్నారు. దీనిపై ఆయా సంఘాల మహిళలు తనను కలిసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి ఆసరా పథకం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా 15 సంఘాల సభ్యులకు రూ.50 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 15 సంఘాల సభ్యులకు మూడు విడతలకు సంబంధించి రూ.37 లక్షల చెక్కులను ఆయన అందజేశారు. తమ సంఘాలకు ఆసరా సొమ్ములు వస్తాయని అనుకోలేదని, ఎమ్మెల్యే పెండెం దొరబాబు చొరవతో అందరికీ ఆసరా సొమ్ములు అందాయని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



ట్రినిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిన ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

సామర్లకోట: పేదలకు కూడా కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే మహోన్నత లక్ష్యంతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలులోనికి తీసుకు వచ్చారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలో పవర గ్రామంలో ట్రినిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ పథకం సేవలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తండ్రి కంటే రెండు అడుగులు ముందుకు వేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్ఠం చేశారన్నారు. పేదలు ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొండా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, గ్రామ నాయకులు నాగనబోయిన రాజబాబు, వీరంరెడ్డి ఆనంద్, ఆస్పత్రి ప్రతినిధి రికి గూటం, డాక్టర్లు కౌశిక్, మోహన్‌విజయ్, మురళీకృష్ణ, రాజా, భరత్, బాలు, పాల్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రౌతులపూడి: ఎస్.అగ్రహారంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎస్. అగ్రహారంలో రేషన్ బియ్యం నిల్వ చేసినట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ, సివిల్ సప్లయిస్ దాడి చేసి 50 కేజీల చొప్పున 42 బ్యాగుల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.84 వేలు ఉంటుందని తెలిపారు.

నిందితులపై కేసు నమోదు చేసి రౌతులపూడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గ్రామంలోని సంబంధిత రేషన్ డీలర్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో డీటీ టీవీవీ సత్యనారాయణ, వీఆర్వో అరుణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం

- జ్వరమే కదా అని వదిలేస్తే ప్రాణాంతకమే
- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అంటున్న వైద్యాధికారులు



రక్త పరీక్షల కౌంటర్ వద్ద రోగుల క్యూ

పెద్దాపురం: ప్రతికూల వాతావరణంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, దోమల వల్లే జ్వరాల కేసులు అధికంగా నమోదవుతున్నాయి. పారిశుధ్య చర్యలు పటిష్ఠంగా పాటించడమే ఈ సమస్యకు మొదటి పరిష్కారమని వైద్యులు చెప్తున్నారు. ఎండకాస్తునే వర్షాలు కురవడంతో ప్రజలు రోగగ్రస్తులవుతున్నారు. దీంతో ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా రోగులతో రద్దీగా మారుతున్నాయి. నియోజవర్గంలో సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్‌లతో పాటు పులిమేరు, కాండ్రకోట, వేట్లపాలెం పీహెచ్‌సీల్లోనూ ఓపీ సేవలు గతం కంటే భారీగా పెరిగినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. రెండు పట్టణాలు, మండలాల్లోని ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తూనే పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పేరుతో అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

వేగంగా వైద్య సేవలు



జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చే రోగులకు వేగంగా వైద్య సేవలందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైతే సిలైన్ పెట్టి రెండు, మూడు రోజులు ఆసుపత్రిలో ఉంచి వైద్యం చేస్తున్నాం. రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు సూచిస్తున్నాం.

– డాక్టర్ ఎస్.సుదీప్తి, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి, పెద్దాపురం

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఆహారం తీసుకునే ముందు, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. దోమలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచాలకు దోమల తెరలు, కిటికీలు, గుమ్మాలకు దోమల మెష్ వేసుకోవాలి. ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

పెద్దాపురం: స్థానిక వర్తుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేముల సత్య సాయి ప్రసాద్, అరుణ దంపతులు పందిరి రాట వేశారు. 24 ఏళ్లుగా అమ్మవారి పీఠంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నామని గోపిశర్మ పేర్కొన్నారు. ప్రత్యక్ష, పరోక్షంగా పూజలు, చండీహోమాల్లో పాల్గొనే భక్తులు 98661 93557, 88975 54557 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి



అమీనాబాదు ప్రధాన రహదారిపై నిలిచిపోయిన నీరు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు, వాడకం నీరు పోయేందుకు సరైన మార్గం లేకపోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన డ్రైన్ రోడ్డు కంటే ఎత్తులో నిర్మించడం, డ్రైన్ పూడికతో నిండిపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. నీరు నిల్వ ఉండడంతో దోమల పెరిగిపోయి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



సూర్యనారాయణకు పింఛను అందజేస్తున్న వలంటీర్ వాసు

పెద్దాపురం: ప్రతి నెలా ఒకటో తారీఖు వేకువ జామున పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు మరింత సేవాభావాన్ని అలవర్చుకున్నారు. వయసు మీరిన వృద్ధులకు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పింఛన్లు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదో తేదీ వరకు గడువు పొడిగించడంతో బుధవారం మండలంలోని చదలాడ వలంటీర్ ఒబిలిశెట్టి వాసు తమ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు ఆదేశాల మేరకు కాకినాడ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న గవరసాని సూర్యనారాయణకు నగదును అందజేశారు. వలంటీర్ సేవలను పలువురు అధికారులు అభినందించారు.

కట్టడాలకు అనుమతి లేదు

జగ్గంపేట: పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలవ గట్లపై కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేవని, పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ ఎస్ఈ బి.యేసుబాబు తెలిపారు. జగ్గంపేటలో పోలవరం ఎడమ కాలవ గట్లను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారని చెప్పి నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది నిజం కాదని తెలిపారు. ఆక్రమణలు చేసిన వారిపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు తమ సిబ్బంది ఫిర్యాదు చేశారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాజేశ్వరరావు, జగ్గంపేట ఈఈ శ్రీనివాస్, రైతు కూలీ సంఘం నేతలు పాల్గొన్నారు.

27న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి

ప్రత్తిపాడు: ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటనను ఈ నెల 16వ తేదీ నుంచి 27వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై నియోజకవర్గస్థాయి రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. మార్పులు చేయాల్సిన పోలింగ్ కేంద్రాల జాబితాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ఆమె వివరణ ఇచ్చారు. సమావేశంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు జి.చిన్నారావు, కె.సుబ్రహ్మణ్యం, జి.భీమారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు పాల్గొన్నారు.